క్లుప్తంగా

అకాల వర్షంతో రైతుల బెంబేలు

సీతానగరం: అకాల వర్షంతో మండలంలోని రైతులు ఒక్కసారిగా బెంబేలెత్తారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నాలుగు సెంటీమీటర్ల వర్షంపాతం రికార్డ్ అయింది. తెల్ల వారుజాము నుంచి కారుమబ్బులు కమ్మి, ఉదయం 8.30 గంటల నుంచి వర్షం పడటం ప్రారంభించింది. కళ్లాలపై ఉన్న ధాన్యం రాశులను వర్షం నుంచి రక్షణ కల్పించే విధంగా బరకాలు, టార్పాలిన్‌లు వాటిపై వేసి, ధాన్యం వర్షానికి తడవకుండా తగు చర్యలు తీసుకున్నారు. మరి కొంతమంది రైతులు కాటా వేసిన ధాన్యం బస్తాలు తడవకుండా తగు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మండలంలో తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ పరిధిలో సుమారు 8 వేల ఎకరాల దాళ్వా వరిపంట ఉంటుంది. రైతులు బస్తాలపై, ధాన్యం రాశులపై బరకాలు, టార్పాలిన్‌లు వేసి తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీ వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో పెద్ద వంతెన వద్ద కొలువై ఉన్న శ్రీ భూదేవి,శ్రీదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం 10వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కామేశ్వరరావు, శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు.

సాహిత్యం సర్వ కళలకూ ఆధారం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీటీఆర్ఐ: సాహిత్యం సర్వ కళలకూ ఆధారమని అని ప్రముఖ వక్త, ఘంటసాల పాటల గాయకుడు దుర్భ శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక ఎస్‌జీఓ హోమ్‌లో జరిగిన సాహితీ గోదావరి ఉగాది కవితా సంచికను ఆవిష్కరించి అనంతరం ఆయన ప్రసంగించారు. సాహిత్యం కేవలం ఆనందం కోసం కాకుండా సమాజం కోసం అనే ఉద్దేశంతో రచయితలు చైతన్యవంతమైన రచనలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సాహితీ గోదావరి అధ్యక్షుడు డాక్టర్ ర్యాలి శ్రీనివాసు మాట్లాడుతూ ఇప్పటివరకు సాహితీ గోదావరి నాలుగు ఉగాది సంచికలు వెలువరించిందని తెలియజేశారు. ఇదే సమావేశంలో ఓ కలం జ్ఞాపకం సంచిక, మధుర వచనం కవితా సంపుటి నీ అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 20 మంది కవులు కవిత గానం చేశారు. కవులను సాహితీ గోదావరి అధ్యక్షుడు డాక్టర్ ర్యాలి శ్రీనివాసు ఆధ్వర్యంలో సత్కరించారు. తాళ్లపూడి రెవెన్యూ ఏఎస్‌ఓ జోడాల వెంకటేశ్వరరావు, కామేశ్వరరావు, వేమూరి రాధారాణి పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోట 18వ డివిజన్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఐ.ఎల్.టి.డి. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఉత్సవాలు ప్రారంభించారు. డప్పుల గారడీలతో సాంస్కృతిక నృత్యాలతో తీన్మార్ డప్పులతో అంబేడ్కర్ పాటలతో కోలాహలంగా సాగింది. ఐ.ఎల్.టి.డి. సెంటర్ లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి టుటౌన్ ఇన్‌స్పెక్టర్ శివగణేష్, ఎస్సై శ్యాంసుందర్ పూలమాలలు వేశారు. చిన్నారుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అంబేడ్కర్ యూత్ సభ్యులు కొండపల్లి సూరిబాబు, అంగర వంశీ, నిల్లి సుధీర్, గెద్దం శేఖర్, రాజేష్, సంజయ్, కుషిలు, మాదా శ్యామలరావు, కప్పల ప్రవీణ్, కప్పల శేఖర్, కొత్తపల్లి బ్రదర్స్, మంద బాలరాజు, నిల్లి సుబ్బారావు, మీసాల నవీన్, మహిళలు పాల్గొన్నారు.

అదే రద్దీ.. ఏదీ చిత్తశుద్ధి

- నియోజకవర్గ కేంద్రంలో నిత్యం యాతన
- ఎవరికీ పట్టని ట్రాఫిక్ సమస్య


రాజానగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

రాజానగరం: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో ప్రయాణికులు నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నా, పట్టించుకునేవారే కరవయ్యారు. పోలీసు స్టేషను ఉన్నా ఈ ట్రాఫిక్ సమస్య పట్టించుకోవడం లేదు. అలాగని పంచాయతీ సిబ్బంది స్పందిస్తారా అంటే వారూ స్పందించరు. అసలు ఈ సమస్యతో మాకు సంబంధం ఏమిటన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. పాలనాపరమైన అనేక పనులతో బిజీగా ఉండే తమకు ట్రాఫిక్ సమస్య పరిష్కారం వీలు కాదంటారు. దీనితో నిత్యం ఇక్కడి జనానికి, ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య సర్వసాధారణమైంది.

లక్ష్మణ రేఖ దాటేస్తున్నారు

గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మేజర్ సీసీ డ్రైన్లు ఉన్నాయి. వ్యాపారాలు జోరుగా జరిగే స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు, అన్నదాన సత్రం వైపు నుంచి కోదండ రామాలయం వరకు ఉన్న సీసీ మేజర్ డ్రైన్లను రోడ్డు ఆక్రమణలకు లక్ష్మణరేఖగా భావించేవారు. ఆ డ్రైన్లు దాటి వ్యాపారులెవరూ రోడ్డు మీదకు రాకూడదంటూ గతంలో పంచాయతీ అధికారులు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకునేవారు. కానీ కొంతకాలంగా అటువంటి చర్యలు లేకపోవడంతో వ్యాపారులకు పూర్తి స్వేచ్ఛ దొరికినట్టయింది. ఈ నేపథ్యంలో అధిక శాతం మంది వ్యాపారులు తమ వ్యాపారాలను రోడ్డు మీదకు విస్తరిస్తుండటంతో ఆక్రమణలకు గురైన రోడ్డు కుచించుకుపోయి తరచు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా గాంధీ బొమ్మ సెంటర్ నుంచి అటు అన్నదాన సత్రం, ఇటు బస్టాండ్ సెంటర్ వరకు దుకాణాల ముందు వాహనాలు పెట్టుకునే జాగా లేక, ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డు పైనే పార్కు చేస్తుంటే, మరికొంతమంది వ్యాపారులు వ్యాపారాలను షెడ్లు వేసి మరీ రోడ్డు పైకి విస్తరించడం ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా ఉంది. గాంధీ బొమ్మ సెంటర్‌లో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంది. ఎదురుగా వచ్చిన బస్సును మరో బస్సు తప్పించేందుకు కూడా అవసరమైన జాగా లేకుండా ఉందంటే ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పోలీసుల జాడే ఉండదు

గ్రామంలో నిత్యం ఎదురయ్యే ఈ సమస్యను పరిష్కరించే వారే కనిపించడం లేదు. ట్రాఫిక్ నియంత్రణ తమ విధులలో ఒకటిగా ఉన్నా పోలీసులలో ఒక్కరు కూడా ఇక్కడ కూడలిలో కనిపించరు. కొద్ది దూరంలోనే పోలీసు స్టేషను ఉండి, అందులో సుమారు 50 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నా, గ్రామంలో ట్రాఫిక్ నియంత్రణ ఏ ఒక్కరి డ్యూటీ కానట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. గతంలో బస్టాండు సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, వైఎస్సార్ జంక్షన్, హైస్కూల్ జంక్షన్‌లలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు డ్యూటీ చేసేవారు. వారంలో రెండు రోజులపాటు (మంగళ, శుక్రవారాలు) సంత జరిగే మార్కెట్ ఏరియాలో సైతం పోలీసుల జాడ ఉండటం లేదంటే నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఆక్రమణలను తొలగించాలి

గ్రామంలోని మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. ఈ కారణంగానే కూడలి ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ముందుగా ఆక్రమణలను తొలగించి, ఆపై పోలీసులు డ్యూటీ చేస్తే ట్రాఫిక్ సమస్య క్షణాలలో పరిష్కారమవుతుంది. కానీ ఆ విధంగా చర్యలు తీసుకునేవారే లేరు. రాజకీయ నాయకులకు ఓట్లు కావాలి, అధికారులకు ఆదేశాలు ఉండాలి. ఇవి రెండు లేనిచోట ఇటువంటి సమస్యలు ఎదురవుతూనే ఉంటాయి.

– పతివాద సూర్యనారాయణ, ప్రయాణికుడు, రాజానగరం

పేరుకే నియోజకవర్గ కేంద్రం

పేరుకే రాజానగరం ఒక నియోజకవర్గ కేంద్రం. అభివృద్ధికి మాత్రం ఆమడ దూరం అన్నట్టుగా ఈ గ్రామం ఉంది. ఇక్కడ ఒక్క ట్రాఫిక్ సమస్యే కాదు, అన్నీ సమస్యలే. దొరికినంత దోచుకో, పంచుకో అనే నీతి ఇక్కడ అమలు జరుగుతోంది. ఎక్కడా లేనంతగా ఈ గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. వాటిని రాజకీయ నాయకులు సపోర్టుతో కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని, దుకాణాలు పెట్టడంతో ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయి, నిరంతరం ట్రాఫిక్ సమస్య ఎదురవుతూనే ఉంది.

– గుబ్బల ఏసుబాబు, రిటైర్డ్ వలంటీర్, సూర్యారావుపేట

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు


జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ , అన్నదానం ఏర్పాటు చేసింది.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మిర్తిపాడు శివారున పేకాడుతుండగా ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.8,750 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఉపాధ్యాయులతో పాటు పూర్వ విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఆదివారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో 2000–2001 ఏడాది 10వ తరగతి విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వీరిలో కొంత మంది ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాలు చేస్తుండగా, మరి కొందరు వ్యాపారులు, వ్యవసాయదారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులుగానూ ఉన్నారు. చదివిన రోజుల్లో చేసిన అల్లరి పనులు, చిలిపి పనులు చెప్పుకుని ఉల్లాసంగా గడిపారు. మ్యూజిక్ చైర్, అంత్యాక్షరి వంటి పలు రకాల ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా కేరింతలతో గడిపారు. మట్ట సతీష్, కొమ్మిరెడ్డి శ్రీనివాస్, చిన్న కేశవ, మస్యం రాము, జంపన వరలక్ష్మి, తోటకూర శ్రీలక్ష్మి, బొల్లిన పుష్ప, ఎస్ భవానీ, చంద్రకళ తదితరులు అప్పటి తీపి గుర్తులను తెలియపర్చుతూ సందడి చేశారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఆగిన గ్రావెల్, మట్టి తవ్వకాలు

సాక్షి ఇంపాక్ట్

రాజానగరం: మండలంలోని కలవచర్ల వద్ద పోలవరం కాలువ గట్టున ఉన్న గ్రావెల్, మట్టి తవ్వకాలు ఆగాయి. అక్కడ ఉన్న లారీలను, పొక్లయినర్‌లను యజమానులు తీసుకుపోయారు. గ్రావెల్, మట్టి అక్రమ రవాణాపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం రాత్రి లారీలను అడ్డుకున్న ఘటనను 'గ్రావెల్ అక్రమ రవాణాపై జనాగ్రహం' శీర్షికన సాక్షి వెలుగులోకి తీసుకువచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఈ అక్రమ రవాణాను వెనుక ఉండి నడిపించిన వ్యక్తులు స్పందించి, జనం ఆపిన లారీలను సంఘటన స్థలం నుంచి తెల్లవారకమునుపే అధికార పార్టీకి చెందిన స్థానిక పెద్దల సాయంతో వాటి యజమానులు తీసుకువెళ్లేట్టు చేశారు. ప్రస్తుతం గ్రామస్తులు అంతా పార్టీలకు అతీతంగా ఆగ్రహంతో ఉన్నందున ప్రస్తుతం గ్రావెల్, మట్టి తవ్వకాలను నిలిపివేసినట్టుగా తెలుస్తోంది. వచ్చీ పోయే లారీల మోతతోపాటు ఎగసిపడే దుమ్ము ధూళి నుంచి ఉపశమనం కలిగినందుకు కలవచర్ల గ్రామస్తులు ఊరటచెందారు.

వైభవంగా సీతారాముల ప్రతిష్ఠోత్సవం


ప్రతిష్ఠ అనంతరం దేవతామూర్తులను దర్శించుకుంటున్న జక్కంపూడి


కోరుకొండ పోలేరమ్మ వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని తోకాడలో పునర్నిర్మించిన సీతారాముల ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొని, దేవతా మూర్తులను దర్శించుకున్నారు. రూ.40 లక్షల వ్యయంతో జరిగిన ఈ ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.10 లక్షలు మంజూరు కాగా, మిగిలిన వ్యయాన్ని దాతల విరాళాల ద్వారా సమకూర్చారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండ రామకృష్ణా థియేటర్ సమీపంలోని పోలేరమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రజలకు సుఖ సంతోషాలందించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఆధ్యాత్మిక సందడిని తెచ్చిందన్నారు. నియోజకవర్గంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా 117 దేవాలయాల నిర్మాణం చేశామన్నారు. ఒక్కో దేవాలయానికి 10 లక్షల రూపాయల గ్రాంట్లు తెచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దానిలో భాగంగానే పోలేరమ్మవారి ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాపై దాడి చేసిన గూండాలకు శిక్ష పడేలా చేస్తా

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


దోమాడలో బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఈ నెల ఒకటో తేది రాత్రి తనపై పెదపూడిలో దాడికి పాల్పడిన టీడీపీ, ఎన్డీఏ గూండాలకు కఠిన శిక్షపడేలా చేస్తానని, ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ తనపై దాడికి పాల్పడిన వారిపై పార్టీ నాయకులతో కలసి ఈ నెల 3న ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. దోమాడలో బాధితులను పరామర్శించారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తానని హెచ్చరించారు. ఇప్పుడు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గూండాలు, రౌడీలను కాపాడుతుండవచ్చు. అయితే రేపు వారిని ఎవరూ కాపాడలేరు అంటూ మండిపడ్డారు. తన వద్ద దాడికి సంబంధించిన అన్ని వీడియోలు, ఫొటోలు ఉన్నాయని, దాడికి పాల్పడిన గూండాలందరికీ కఠిన శిక్షలు వేసేలాగా చేస్తానని స్పష్టం చేశారు. తమపై దాడి సమయంలో తనకు రక్షణ, అండగా నిలిచిన ధైర్యవంతులైన మహిళలకు ప్రత్యేక వందనాలు తెలియజేస్తున్నానన్నారు. బాధితులు తనపై చూపుతున్న నమ్మకాన్ని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన గూండాలతో తనను హత్య చేసేందుకు ప్రయత్నించారని సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. ఇది రాజకీయం కాదని, ఇది దిగజారుడు రాజకీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను పేదల కోసం, పేదల పక్షాన పోరాడుతుంటే ఎమ్మెల్యే నల్లమిల్లికి తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని, ఆ కారణంగా తనను అంతమొందించాలని ప్రయత్నం చేస్తున్నారని సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. తాను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేయించే దాడులకు భయపడే వ్యక్తిని కాదని అన్నారు. దోమాడ బాధితులకు లేఅవుట్ యజమాని నుంచి రావాల్సిన నష్టపరిహారాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి మింగేసి ఉంటాడని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం పెద్ద ఎత్తున చేస్తానని ప్రకటించారు. ఇది కేవలం రాజకీయ పోరాటం కాదని, ఇది ప్రజాస్వామ్యాన్ని కాపాడే యుద్ధమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, దోమాడ గ్రామ సర్పంచ్ మీనవల్లి శారదదేవి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ప్రతిరూపం భగీరథుడు

కలెక్టర్ పి ప్రశాంతి


భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భగీరథుని జీవితం నుంచి మనం స్ఫూర్తి పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివి నుంచి భువికి గంగను తీసుకుని రావాలన్న భగీరథుని లక్ష్యం, చిత్తశుద్ధి, కఠోర సాధన ద్వారానే సాధ్యం అయిందని చెప్పారు. భగీరథుని జీవితం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలన్న ఉద్దేశంతో ఆయన జయంతి వేడుకలను జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. గంగను దివి నుంచి భువికి తీసుకు రావాలన్న లక్ష్యాన్ని చిన్నతనంలోనే నిర్దేశించుకొని నిరుత్సాహ పడకుండా ప్రయత్నించి సఫలీకృతం అయ్యారన్నారు. సంగం నీళ్లు ఉన్న గ్లాసును చూసి 'సగం నీళ్ళు మాత్రమే ఉన్నాయని' ప్రతికూల స్వభావం కలిగి ఉన్న వ్యక్తులు భావిస్తే, సానుకూల స్వభావం కలవారు 'గ్లాసు ఖాళీగా ఉండకుండా సగం నిండి ఉంది' అని ఆశావహ దృక్పథం కలిగి ఉంటారని చెప్పారు. ఎప్పుడు సానుకూల ఆలోచనా ధోరణి కలిగి ఉంటామో, అప్పుడు అనుకూల ఫలితాలు సాధ్యం అవుతాయని పేర్కొన్నారు. బృహత్తర లక్ష్యాలను సాధించిన వారి నుంచి ప్రేరణ పొందాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సానుకూల వైఖరి అవసరమని, తద్వారా మెరుగైన ఫలితాలు సాధించడం సాధ్యం అవుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జోరున వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం


నగరంలోని రామచంద్రరావుపేటలో రోడ్డుపై వర్షం నీరు


జలమయమైన బొమ్మూరు బాలాజీపేట రోడ్డు


ఆదెమ్మదిబ్బ ప్రాంతం ఇలా..

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో ఆదివారం ఉదయం ఒక్కసారిగా భారీవర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు అన్నీ జలమయమయ్యాయి. కొద్దిరోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు వర్షం రాకతో కొంత ఉపశమనం పొందారు. చిరు వ్యాపారులు మాత్రం వర్షం వలన వ్యాపారాలు లేక ఇబ్బందులు పడ్డారు. వర్షం రాకతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రాజమహేంద్రవరం నగరంలోనూ ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో జనం రాకపోకలకు అవస్థలు పడ్డారు.

అలరించిన కవులు, గాయకుల సమ్మేళనం


కవులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: అంబేడ్కరీయం పేరిట కవులు, గాయకుల సమ్మేళనం ఏర్పాటు చేసి ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన అంబేడ్కర్ సేవా కేంద్రం చరిత్రలో నిలుస్తుందని రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ పాడి రామారావు ప్రశంసించారు. ఆదివారం స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన కవులు, గాయకుల సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సేవా కేంద్రం చేస్తున్న సేవలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలు నూతన ఒరవడిని సృష్టిస్తున్నాయన్నారు. ప్రముఖ కవి డాక్టర్ గూటం స్వామి సభా నిర్వాహకులుగా వ్యవహరించారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 100 మంది కవులు, గాయకులు పాల్గొని తమ కవితలతోనూ, గానంతోనూ అలరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కవులు, గాయకులను సన్మానించి అభినందించారు. తిలక్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి సమ్మేళనాలు సమాజాన్ని ప్రభావితం చేసి మరింత మందిని తయారు చేయడానికి ఊతమందిస్తాయన్నారు. అంబేడ్కర్ సేవా కేంద్రం చైర్మన్ డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ సమ్మేళనాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు 1,670 బౌద్ధ వివాహాలు జరిపించిన అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన గిడ్ల వీరప్రసాద్‌ను సత్కరించారు. నయనాల కృష్ణారావు, జి.కూర్మయ్య, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి


సతీష్‌శర్మను సత్కరిస్తున్న సమాఖ్య సభ్యులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలోని బ్రాహ్మణులను ప్రభుత్వం గుర్తించేలా చేసి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ అన్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సతీష్ శర్మకు రాజమహేంద్రవరం నగర బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పుల్లీవు సూర్య వెంకటరావు సారథ్యంలో ఆదివారం కుమారి థియేటర్ ఎదురుగా ఉన్న జూపూడి ఫంక్షన్ హాలులో సత్కారం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని బ్రాహ్మణ యువత, విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి, నైపుణ్యాలు పెంచి యువతీ యువకులకు సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బ్రాహ్మణ మహిళల సాధికారత, స్వావలంబనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సతీష్ శర్మ చెప్పారు. సమాఖ్య కార్యదర్శి కొత్తపల్లి శ్రీదేవి మాట్లాడుతూ బ్రాహ్మణ మహిళల ఉన్నత విద్యతో డాక్టర్, ఇంజినీర్లు ఇతర ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బ్రాహ్మణ గర్జన నిర్వహించాలని శ్రీదేవి కోరారు. సత్యవాడ దుర్గాప్రసాద్, కోశాధికారి పులిపాక ప్రసాద్ పాల్గొన్నారు.